519118701

# ప్రబోధ 29

కోమలత్వంబు నిస్వార్థగుణము కల్గి
సేవ చేయుట నిజమైన సేవయగును
స్నేహభావంబుతో గూడి సేవ చేయ
శాంతిధామంబు చేరుట సత్యమయ్యా.

దివ్యాత్మస్వరూపులారా!

జీవితము నిస్వార్థసేవలకై నియమించినదే కాని స్వార్థమునకు కాదనే సత్యాన్ని అర్థము చేసుకోవాలి. నిస్వార్థసేవల వలన మానవాళి యేకత్వాన్ని గుర్తించటానికి వీలవుతుంది. నిస్వార్థసేవ కర్మయోగమునకు కీలకము. మనస్సుకు, దేహమునకు నిస్వార్థసేవతో శిక్షణ అందించటమే యోగమునకు మూలాధారము. సమాజమునందు నిస్వార్థసేవ సల్పు వ్యక్తులనే సమాజము గౌరవిస్తుంది. సమాజగౌరవాన్ని అందుకున్న మానవుడు దైవప్రేమకు పాత్రుడౌతాడు. నిస్వార్థసేవ మానవునకు అత్యవసరమనే సత్యాన్ని ప్రతివ్యక్తి కూడను గుర్తించవలసివస్తుంది. నిస్వార్థసేవతో బాటు త్యాగభావము కూడను అతను పూనివుండాలి. ఇట్టి త్యాగభావముతో కూడిన ప్రేమతత్వమునందు స్వార్థము దూరము చేసి పరార్థమైన భావముతో ఆచరించటమే నిజమైన నిస్వార్థసేవగా రూపొందుతుంది. జీవితమునకు నిస్వార్థసేవ రుచిని చేకూర్చు లవణము వంటిది. విశ్వప్రేమ జీవితమునకు పుష్టిని అందించే ఆహారము వంటిది. ప్రేమనే మానవునకు జీవితములో ప్రాణము. భాతృత్వమే జీవితమునకు సరైన సుగంధము. కనుక యీ భాతృత్వభావమును ప్రతి మానవుని హృదయమునకు హత్తుకొని తద్వారా సేవయందు ప్రవేశించటము అత్యవసరము. మానవుడు యింతటివాడైనప్పటికిని నిస్వార్థసేవకై యేర్పడినదే యీ జీవితమని గుర్తించాలి. తల్లిబిడ్డలుగాని గురుశిష్యులుగాని దైవము భక్తుడుగాని ఒకరినొకరు ఆశ్రయించే వుంటున్నారు. తల్లియే లేకున్న బిడ్డ అనే పదమునకు అర్థమే లేదు. బిడ్డ లేకుండిన తల్లి అనే పదమునకు అర్థమే లేదు. అదే విధముగనే దైవమే లేకుండిన దాసుడే లేడు. దాసుడే లేకుండిన దైవమే లేడు. ఈ రెండు పదములు కూడను ఒకదానికొకటి అన్యోన్యములో కొంతవరకును సమన్వయము గావించుకొని ఒకదానికొకటి అన్యోన్యాశ్రయమై వుంటున్నది. ఈ అవినాభావసంబంధమైన తత్వాన్ని అందరూ గుర్తించాలి.

మనము యితరులతో సేవ చేయించుకొనుటకంటె యితరులకు సేవ చేసే వ్యక్తులుగా రూపొందాలి. ఇంతేకాక మనకంటె అధికస్థాయిలో వుండిన వారికి సేవ చేయటము అంత గొప్ప కాదు. కారణమేమనగా వారికి అనేకమంది సేవకులుండవచ్చు. మనతో సమానమైన

519118702

శక్తికల్గిన వారికి సేవ చేయటము కూడను అంత గొప్పకాదు. మనకంటె తక్కువస్థాయియందువుండి లోకము నిర్లక్ష్యము గావించిన వ్యక్తులకే మనము సేవ చెయ్యాలి. మానవులయొక్క తెగలను మనము విచారణ చేసి విభజించినప్పుడు ఉన్నతస్థాయియందువున్నటువంటివారలను లక్ష్మీనారాయణ స్థాయిఅని చెప్పవచ్చును. మనతో సమానస్థాయియందున్నవాడు అశ్వర్థనారాయణఅని చెప్పవచ్చును. మనకంటె తక్కువస్థాయి యందుండినవానిని కేవలము దరిద్రనారాయణులని చెప్పవచ్చును. లక్ష్మీనారాయణునికి మనముసేవ చేయనక్కరలేదు. అతనికి కావలసినంతమంది సేవకులుంటారు. అశ్వర్థనారాయణుడంటే నిరంతరము కోరికలవెంటపరుగెత్తేవాడు. ఎన్నివిధములైనశక్తి సామర్థ్యములుండినప్పటికి అతనికి యేమాత్రం తృప్తిఅనేది వుండదు. ఎంతసంపాదనచేసినప్పటికి యింకనూసంపాదించాలనే దురాశతో అతను కుమిలిపోతుంటాడు. అలాంటివారికిసేవచేయవలసిన అవసరమేలేదు. కానీ దీనులై దరిద్రులై ప్రకృతియొక్క దృష్టిలో కూడను దూరముగావింపబడిన దీనజనులకు సేవ చేయటము అత్యవసరము. ఆస్థితియందు కూడను యెవరికో మనముసేవచేస్తున్నామనభావన తలంచరాదు. ఈలోకములోవుండిన నారాయణునికి నేనుసేవచేస్తున్నాను అనే ప్రేమభావముతో మనము హృదయపూర్వకముగా సేవచేయాలి.

మనోవాక్కర్మలచేతను, కాయముచేతను సేవలుగావించినవారికే మనసు పరిశుద్ధమవుతుంది. మానసికపరిశుద్ధములేక మానవుడే మాత్రము వున్నతస్థాయిని చెందలేడు. కార్యకర్తలయందుఅహంకారముగాని, ఆడంబరముకాని యేమాత్రము వుండరాదు. కార్యకర్తలువిశాలమైన హృదయము కల్గివుండాలి. నిస్వార్థమైనభావము వుంటుండాలి. ప్రేమహృదయమును పెంచుకోవాలి. కార్యకర్తలే సంస్థకు వెన్నెముకవంటివారు. అలాంటివారు ప్రాథమికమానవత్వాన్ని అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకోటంమాత్రమే చాలదు. ఆచరించాలి. ఇట్టి ఆచరణలేక ఆడంబర అహంకారములతో చేసే సేవలు సేవలనిపించుకోవు. జీవితములో మనము అనుభవించే సుఖదుఃఖములు, సాధించే రాగద్వేషములు, సేవించే విషయవాసనలు యివన్నీ మానసికవికారములే. ఇది వేరు, నేను వేరు అనే ద్వైతభావమే యీవికారమునకు మూలకారణము. ఎవరెట్లైనను ఫరవాలేదు నేను, నావారు మాత్రమే క్షేమంగా, ఆనందంగా వుంటుండాలి అనే స్వార్థభావమే ద్వైతమునకు మూలకారణము.

ఇట్టి ద్వైతభావముచేతనే మానవునియందు రాగద్వేషములు అభివృద్ధిగాంచుచున్నవి. ఈ రాగద్వేషములే మనసును మాలిన్యంగావించుచున్నవి. కనుక తరతరములనుండి యీ మాలిన్యముతో కరడుగట్టిన యీమనసును పరిశుద్ధము చేయవలెనన్న అంతసులభముగా అయ్యేదికాదు. ఇది కేవలం ఒక సేవలద్వారానే యిది పరిశుద్ధమవుతుంది. తైలపుగిన్నెలో వుండిన చంద్రప్రతిబింబాన్ని మనము వేరుగావించాలనుకున్నప్పుడు దానిని సరైన మార్గాన్ని అనుసరించాలి. కానీ యీనాటి మానవుడు తైలపుగిన్నెలో వున్న చంద్రబింబాన్ని దూరముచేయాలనే సంకల్ప

519118703.

ము చేత ఆ పాత్రను నిప్పులో పెట్టి కాలుస్తున్నారు. ఈ ప్రతిబింబమునకు తైలమే కారణముగాని గిన్నెకాదు. తైలమును తీసివేసినప్పుడే యీ ప్రతిబింబము దూరమౌతుంది. అట్లుకాక పాత్ర అయిన దేహాన్ని మనము శిక్షించటానికి ప్రయత్నించినప్పుడు యీ ప్రతిబింబమనే మాలిన్యము మనకెన్నటికి దూరముకాదు.

పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా
తనువును తాదండించిన విషయభోగములుడుగునా
ఆకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞానియగునా
తానెవరో తెలియకున్న తత్వజ్ఞానమెరుగునా.

ఈనాడు దినమునకు పదిపర్యాయములు స్నానముగావించి, శుచియైన వస్త్రము ధరించి నీ దేవుని తలంచి యాంత్రికముగా మనం మంత్రం ఉచ్ఛరించినంతమాత్రమున మనలోనున్న మాలిన్యము యేమాత్రము దూరంకాదు. కాని యీనాడు యీ విధమైన దురభ్యాసములు మాత్రమే మనము గావిస్తున్నాము. స్నానము చేయటము, విభూతిని ధరించటము, మంత్రములు ఉచ్ఛరించటము యివన్నీ కేవలము ఆడంబరములైన మార్గములేగాని ఆత్మకు సంబంధించినవి కావు. ఇది మానసిక పరిశుద్ధముగావించటానికి యిది యేమాత్రం కూడను ముందంజ వేయదు. విచారణచేత, నిస్వార్థభావము చేత సమాజములో మనము పాల్గొనాలి. ఏ విజ్ఞానము మానవుని పశుత్వమునుండి వేరుచేసి దీనిని అధికంగావించినదో, ఆ విజ్ఞానాన్ని మనం యీనాడు మనం మరచిపోతున్నాము. ఆ విజ్ఞాన తత్వాన్ని మనం విచారించటానికి ప్రయత్నము చేయటంలేదు. సత్యమును అసత్యముగను, అసత్యమును సత్యముగను భావించి తాను తన సంపద, తన కుటుంబము శాశ్వతమని భావిస్తున్న మానవుడు. ఈ సంకుచితమైన స్థాయినుండి విశాలమైన మార్గమునకు మనము ప్రయాణము చెయ్యాలి. యీ వరల్డ్ మానవులందరు కూడను ఒక్క ఈశ్వర కుటుంబముగా మనము విశ్వసించాలి. స్వార్థమును త్యాగము చెయ్యాలి. అప్పుడే ఆ విశాలభావములను అందుకొనుటకు అర్హులమౌతాము. అట్లుకాక మనము యేదో లౌకికముగా, యాంత్రికముగా యనేకవిధములుగా మనము సాధనలు సల్పినంతమాత్రమున భక్తులము కాలేము. వేదశాస్త్ర యితిహాస పురాణములను పఠించవచ్చును. గొప్ప తెలివితేటలు కలవాడుగా రూపొందించవచ్చును. ఈ తెలివితేటలు కాదు యీ సాధనలకు కావలసినవి. నూరుమంది తెలివితేటలుగల్గిన వారికంటె మంచి హృదయముగల్గిన ఒక్క వ్యక్తి వుంటే చాలు. కనుక మనసు మంచి మనసు కలిగిన మానవుడుగా తయారుకావాలి. ఈ మంచి మనసు కలిగినప్పుడే మంచి పనులలో మనము ప్రవేశిస్తాము. మనసు నిండుక సంకుచితమైన భావాలు, అసూయ భావాలు క్రోధరాగములతో కూడిన భావాలను నింపుకొని యీ సేవలయందు ప్రవేశించినంతమాత్రమున సేవకులము కానేరము.

ఏమిలేని బుట్టలోన
ఏమైనను చేర్చవచ్చు

519118704

ఏమేమో నిండియున్న
తలబుట్టది ఖాళియగునా
తలబుట్టది ఖాళిగాక
ఇల సుకృతంబు నింపనగునా.

కనుక మనలో వుండిన దుర్భావములు, దుర్గుణములు, దురాలోచనలు, స్వార్థము, అహంకారమనేవి మొట్టమొదట తీసివెయ్యాలి. అప్పుడే మన ప్రేమభావము అందులో ఆవిర్భవిస్తుంది.

ప్రేమ కల్గిన హృదయమే నిజమైన పవిత్ర హృదయము. కనుక ప్రేమభావముతో మనము సేవలో ప్రవేశించాలి. కానీ పేరు ప్రతిష్టల కోసము మనము ప్రాకులాడరాదు. కీర్తి అనేది కేవలము మనము కొనుక్కుంటే లభించేదికాదు. ఒకరితో మనము పుచ్చుకొనే పదార్థము కాదిది. ఈ కీర్తి అనేటువంటిది ఒక ప్రవాహము వంటిది. అది బాలా చిన్నదిగా పుట్టవచ్చును. క్రమక్రమేణా అది పెరిగి పెద్దదికావచ్చును. కనుక మనము కీర్తి మర్యాదల కోసము ప్రాకులాడరాదు. కర్తవ్యమును నిర్వంచు కొనే చిత్తమును మనము అభివృద్ధి పరచుకోవాలి. కానీ అలాంటి చిత్తము ఒక్క సేవల ద్వారానే మనకు లభిస్తుంది. సేవ చేయలేని మానవుడు మానవుడే కాదు. సేవకై జన్మించిన మానవుడుగా మనము విశ్వసించాలి. ఇలాంటి పవిత్రమైన మానవత్వమును మనము సార్థకము గావించుకొనవలెనన్న మనము యీ విధమైన సమాజ సేవలో మనము పాల్గొనాలి. మనము యే కించిత్ సేవ చేసినప్పటికిని మంచి వారలను మంచి మార్గములో మంచి మనసుతో మనము యనేకవిధములైన గొప్పను మనము అందుకొటానికి అర్హులమవుతాము. సేవ చిన్నదిగా వుండవచ్చును. కాని హృదయాన్ని గొప్పదిగా మనము మార్చుకోవాలి. ఆవుకు పనికి మాలిన గడ్డి వేసినప్పటికి పవిత్రమైన క్షీరాన్ని అందిస్తుంది. అదే విధముగనే నీ సేవ బాలా చిన్నదైనప్పటికిని, యెలాంటివారికి చేసినప్పటికిని అది పవిత్ర హృదయముతో చేస్తే అది గొప్ప ఫలితము గారూపొందుతుంది. మనము ఫలితము లక్ష్యము నందుంచుకొని సేవ చెయ్యరాదు. ఇది నా కర్తవ్యము. యీ సేవ నిమిత్తమై జన్మించినవాడను అనే విశ్వాసము మనము అభివృద్ధి గావించుకోవాలి. జగత్తులో వుండిన ప్రతి ప్రాణి ఒకరికొకరు సేవ చేసుకునేవారే గాని ఒకరికంటె ఒకరు అధికులెవ్వరు లేరు. ఏ ఏ స్థాయికి సంబంధించిన వ్యక్తులు ఆయా స్థాయిలో ఆయా సేవలు ఆచరించాలి. దేహములో యనేక అంగములుంటున్నాయి. కానీ చేతులు చేసే పనులు కాళ్ళు చేయలేవు. పాదములు చేసే పనులు చేతులు చేయలేవు. కన్నులు చేసే పనులు చెవులు చేయలేవు. చెవులనుభవించే ఫలితము కన్నులు అనుభవించలేవు. అదే విధముగనే వ్యక్తులు యనేకవిధములుగా వుండవచ్చు. వారిలో శక్తి సామర్థ్యములు భిన్న భిన్నముగా వుండవచ్చు. కాని యెవరి శక్తికి తగ్గట్టుగా, యెవరి హృదయానికి తగినట్టుగా, యెవరి స్థాయికి తగినట్టుగా వారు సేవలయందే పాల్గొనాలి. జపములు, ధ్యానములు, పూజలు, యిలాంటి వ్రతములు తమ తమ అభీష్టముగా, వ్యక్తిగతముగా యెంతైననూ ఆచరించుకోవచ్చు. ఎందువలననగా యీ జపతపములు, యాగములు

519118705

యజ్ఞములు చేసేదానికంటె సేవలకుమించిన ఫలితము మరొకదేంట్లోకనుపించదు.

నతపాంసి న తీర్థానాం న శాస్త్రాణాం నజపానపి
సంసారసాగరోత్తారం సజ్జనసేవనం వినా

మనం యెన్ని యాత్రలు చేసినప్పటికి మన భావములు కేవలము లోకాన్ని మాత్రమే ఆకర్షిస్తుంటాడి. కానీ హృదయసంబంధమైన పవిత్రము యేమాత్రముకూడను గుర్తించటానికి ప్రయత్నించటంలేదు.

వ్యక్తి ముక్తి కోరుట స్వార్థమగును. తాను మాత్రమే తరించ కోరుట ధర్మము కాదు. పరులను కూడ తరింపచేయటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి. అదే నిజమైన సేవ. మనము ఆవిధమైన విశాలభావాన్ని యీనాటికిని అందుకోలేకపోతున్నాము. ఎంతకాలమైనప్పటికి స్వార్థము, స్వప్రయోజనము. స్వార్థము స్వప్రయోజనము. ఇట్టిస్థితియందే వున్నప్పుడు భగవత్ కృపగాని, భగవత్ త్వముగాని యేవిధముగా అర్థము చేసుకోగలము. కనుక మానవత్వములో పవిత్రమైన దివ్యత్వము కలదనే సత్యాన్ని మొట్టమొదట మనము విశ్వసించాలి. ప్రపంచమంతయు కూడను తన యొక్క తత్త్వమే అనే సత్యము గుర్తించాలి. విశ్వసించాలి. అనేకత్వములో నియేకత్వాన్ని మనము అర్థము చేసుకోవాలి. అప్పుడే తాను దైవత్వాన్ని కొంతవరకునైనా అర్థము చేసుకున్నవాడు కాగలడు. అట్టి దైవత్వాన్ని అర్థము చేసుకొనక యీవిధమైన మూర్ఖత్వములో మనము స్వార్థమును అనుభవించుకుంటూ కూర్చున్నంతకాలము మానవత్వము అర్థముకాదు. కనుక స్వార్థమును మనము త్యాగము చెయ్యాలి. ఈ స్వార్థము వుండినంతవరకు ద్వైతము తప్పినది కాదు. ద్వైతభావము వుండినంతవరకు రాగద్వేషములను మనము దూరము చేసుకొనలేము. రాగద్వేషములే మానవుని దుఃఖమునకు మూలకారణము. అహంకారము వుండిన మానవుని సమాజము గౌరవించదు. క్రోధము కలిగినవాడు దుఃఖము నుండి వేరుకాలేడు. లోభము వుండినంతవరకు వాని యొక్క విశాలత్వము తాను గుర్తించలేడు. అహంకార, రాగద్వేషములు వుండినంతవరకు మానవుడు తన్నుతాను అర్థము చేసుకొనలేడు. తనను తాను అర్థము చేసుకున్నవాడే పరులను అర్థము చేసుకొనుటకు శక్తిమంతుడౌతాడు. మొట్టమొదట తన తత్త్వాన్ని తాను గుర్తించాలి. ప్రతివిషయమునందుకూడను నేను నేను నేను యీనేను అనేటువంటిది యెక్కడ వుంది. ఇది పుట్టటానికి యేదో ఒక స్థానము వుండాలి కదా. ఈ నేను యెక్కడనుండి ఆవిర్భవిస్తున్నాది. ఇది శరీరములో యేదో ఒక భాగములో వుద్భవించటానికి ఒకస్థానము వుండాలి. అయితే లౌకికజగత్తులో చూచినప్పుడు యీనేను నేను అనేది శారీరక దృష్టితో అనుభవిస్తున్నాము. ఈ నేను నేను అనే అహంభావమును శృతులు హృదయము అని పిలుస్తూ వచ్చాయి. ఈ శృతులంతా హృదయము అని పిలిచినప్పుడు యీహృదయము దేహములో యెక్కడో ఒక భాగముగా వుండాలి. కాని సమముగా విచారించినప్పుడు యిది ఒక భాగముగా వుండేది కాదు. విశ్వమంతా వ్యాపించినదే హృదయము. ఈ హృదయమునకే ఆత్మ అని పేరు. ఈ ఆత్మ

519118706

హృదయములో వున్నదని మరికొంతమంది అనుభవిస్తుంటారు. ఇదికూడను చాలా పొరపాటు. హృదయమే ఆత్మ. ఆత్మయే హృదయము కాని హృదయములో ఆత్మవున్నదని భావించుటము అజ్ఞానము.

అయితే మనము యీవిధమైన అంధకారములో మునిగి అజ్ఞానముతో పరితపిస్తున్నామంటే దీనికి మూలకారణమేమిటి. మనదృష్టి ఆత్మపై ప్రయాణించయటంలేదు. కేవలము మనసు వరకే యిది ప్రయాణము సలుపుతున్నది. మనసుపైననే ఆధారపడినవాడు యీ అజ్ఞానమనే అంధకారములో పడక తప్పదు. అయితే యీ మనసును అరికట్టే విధానమేమిటి? మనసును అరికట్టనవసరము లేదు. ఈ మనసును అరికట్టుటకు యెవరికిని సాధ్యము కాదు. అయితే యీ మనసును యేవిధముగా స్వాధీనము చేసుకోవాలి. దీనికి ఒక్కటే ఒక్క ఉపాయము. సూర్యుడు వుండినంత వరకు కూడను చంద్రుని మనము లక్ష్యము చేయము. చంద్రుడు కూడను ప్రకాశించలేడు. చంద్రుని యొక్క ప్రకాశమంతయు సూర్యునిపైననే ఆధారపడి వుంటున్నది. ఎప్పుడు సూర్యుడు లేకుండునో అప్పుడే యీ చంద్రుని మనము ఆశిస్తాము. అదేవిధముగనే ఆత్మనే సూర్యుడు. మనసే చంద్రుడు. ఆత్మదృష్టి లేనంతవరకు మాత్రమే మనస్సనే చంద్రునిపై ఆధారపడి వుంటున్నాము మనము. అయితే యీ చంద్రుడనే మనసు కూడను ఆత్మ అనే సూర్యునిపైన సూర్యునిపైన ఆధారపడి వున్నాడనే సత్యమును కూడను మనము గుర్తించుకోలేకపోతున్నాము. కనుక మనము మన యొక్క దృష్టిని ఆత్మపై పూర్తిగా మరల్చినప్పుడు మనసు సహజముగనే మాయమవుతుంది. అది వుండినా కూడను అదృశ్యమైపోతుంది. కనుపించదు. సూర్యుడు ప్రకాశించే సమయములో చంద్రుడు కనుపించవచ్చు కాని అతను అప్రకాశకుడే. అదేవిధముగనే మనము జీవితమంతా మనసునే ఆశ్రయించి, మనసునే ఆధారము చేసుకొని మనము జీవించటానికి ప్రయత్నించినంతకాలము మనకు దుఃఖములు రాగద్వేషములు దూరము చేసుకొనుటకు యేమాత్రము వీలుకాదు. కనుక సర్వత్రా వుండినటువంటి ఆత్మతత్వాన్ని హృదయముగా మనము భావించి, ఆ విశాలత్వమైన భావాన్ని మనము పెంచుకోటానికి ప్రయత్నించాలి.

విశ్వం విష్ణుస్వరూపం. భగవంతుడు యెక్కడో ఒకచోట వుంటున్నాడు అని కాదు మనకు.

దేవుడెక్కడనుచు దేవులాడగనేల
హృదయరూపుడు కాదె ఈశ్వరుండు
ఇచ్చుకొనుము సేవ పుచ్చుకొనుము ప్రేమ.

అక్కడే దైవత్వము మనకు సాక్షాత్కరిస్తుంది. కాని యీనాడు హృదయపూర్వకంగా సేవను యిచ్చుకోటంలేదు, ప్రేమను పుచ్చుకోటంలేదు. సేవనిచ్చే శక్తి వీనికి గాని, ప్రేమనిచ్చే శక్తి అతనికి గాని లేని స్థితిలో వుంటున్నారు. ఈ ప్రేమ కూడను స్వప్రయోజనము, స్వార్థము వైపునకే ప్రయాణమవుతున్నది గాని విశా

లమైన పదార్థము వరకు ప్రయాణము చేయరాదు. కేవలము మన ప్రేమ మన కుటుంబమునకు మాత్రమే పరిమితం కారాదు. ఈ అవధిని దాటి సంఘము వరకు మన ప్రయాణము చెయ్యాలి. ఈ సమాజమును దాటి మనం దేశము వరకు ప్రయాణం చెయ్యాలి. ఈ దేశం నుంచి కూడను విశాలమైన ప్రపంచములో మనం ప్రవేశించాలి. దీనినే బుద్ధుని కూడను చెప్పింది.

బుద్ధం శరణం గచ్ఛామి - సంఘం శరణం గచ్ఛామి.

మనం బుద్ధిని మాత్రమే ఉపయోగపెడుతున్నాము. బుద్ధికి మాత్రమే మనము శరణాగతులమవుతున్నాము. బుద్ధిని మాత్రమే ఆశ్రయిస్తున్నాము. బుద్ధితోనే మనం బద్ధులై పోతున్నాము. ఆ బుద్ధిని అంతవరకే పరిమితి గాకుండా సంఘం శరణం గచ్ఛామి. ఆ సంఘములో ప్రవేశపెట్టాలి యీ బుద్ధిని. అప్పుడే విశాలమైన హృదయాన్ని కలిగి యేకత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నిస్తుంది. ఆకారములు భిన్నంగా వుంటున్నవి కాని, రూపనామములు భిన్నంగా వుంటున్నవి గాని దైవత్వమనే దివ్యత్వమైన హృదయము ఒక్కటే అనే స్థాయికి కొంతవరకునూ ప్రవేశిస్తుంది. అయితే సంఘములో మెంబర్ అయినంత మాత్రమున ప్రయోజనము లేదు. నేను ఫలానా కమిటీలో మెంబరు. మెంబరు అయినంత మాత్రమున యే విప్రయోజనము. కనుకనే బుద్ధం శరణం గచ్ఛామి. సంఘం శరణం గచ్ఛామి. సంఘములో ప్రవేశించాలి. కాని ప్రవేశించి కేవలం యే విధమైన సేవలు చేయకుండా వుండినంత మాత్రమున చచ్చినవానితో సమానమవుతుంది. అక్కడ నుండి ధర్మం శరణం గచ్ఛామి, సంఘములో ధర్మాన్ని మనము ఆశ్రయించాలి. ఆ ధర్మాన్ని మనం ఆచరించాలి. ఆ పవిత్రమైన, నిజమైన సేవలయందు మనం ప్రవేశించినప్పుడే అదే నిజమైన ధర్మము అనది. సేవ చేసే నిమిత్తమునే నుపుట్టాను కాని సేవ చేయించుకొనే నిమిత్తము కాదు అనే సత్యాన్ని మనం యిక్కడ అర్థం చేసుకోవచ్చు. మనము సేవలో ప్రవేశించి మన కర్తవ్యాన్ని నిర్వర్తించుకొనే శక్తిని మనం ఉపయోగపెట్టాలి. నిజముగా భగవంతునికి ప్రీతికరమైన పాత్ర హృదయమే. ఆ హృదయమే తన స్వరూపము. తనను పొందవలసినవాడు తన ఆకారాన్ని పొందాలి. ప్రకాశించే సూర్యుని చూడాలంటే యే హారికన్ లాంతర్, పెట్రొమాక్సులైటు టార్చిలైటో మనకు అక్కరలేదు. ఆ సూర్యుని యొక్క ప్రకాశం చేతనే సూర్యుని చూడాలి. భగవంతుడు ప్రేమస్వరూపుడు. అట్టి ప్రేమస్వరూపుడైన పరమాత్మని మనం పొందాలంటే మనలో అట్టి ప్రేమను అభివృద్ధిగావించుకోవాలి. భగవంతుడు సత్యస్వరూపుడు. అట్టి సత్యాన్ని మనం గుర్తించాలంటే మనము అసత్యములైతే ప్రయోజనము లేదు. మనము కూడను సత్యస్వరూపులము కావాలి. భగవంతుడు శాంతమయుడు. అట్టి శాంతాన్ని మనం పొందాలంటే మనము శాంతాన్ని అనుభవించాలి. అప్పుడే యిది బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. దానిని గుర్తించినవాడు అదిగానే మారిపోతాడు.

మానవుడు మానవునిగా బ్రతకాలంటే మానవుని ప్రేమించాలి. మానవుడు మానవుడుగా బ్రతకాలి. ఈ మానవుడు మానవుడుగా బ్రతకాలనుకున్నప్పుడు రెండు ప్రశ్నలు

519118708

మనం వేసుకోవాలి. నేను మనిషి; నేను మనిషి అని చెప్పకోటము యిది సంపూర్ణసత్యము కాదు. ఇది అర్ధసత్యము మాత్రమే. నేను మానవుడను అనేది అర్ధసత్యము. నేను పశువును కాదు అనేది అర్ధసత్యము. నేను మానవుడు పశువును కాదు, అని యీ రెండిటిని చేర్చినప్పుడు పూర్ణమానవుడవుతాడు. నేను మానవుడను అంటూ పశువుపనులు చేస్తుంటే మానవుడెట్లవుతాడు. పశువు స్వార్ధముతో కూడినది. మనోరహితమైనది - పశువుకు మనసులేదు. కాని మనసుతో కూడినవాడే మనిషి. మనిషి అనే పేరు మనసునుండి వచ్చినదే. కనుక యీ మనసు తత్వాన్ని మనం చక్కగా గుర్తించాలి. ఈ మనసును ఆత్మకు ప్రయాణం సల్పాలి. కనుక యీ ఆత్మతత్వములోపల యేకత్వాన్ని మనము గుర్తించాలి. ప్రతి దేహమునందు యీ ఆత్మ అనేది వుంది. ఈ దేహమనేది ఒక రథము. ఆత్మ దీనికి రథికుడు. కాబట్టి ప్రతి రథమునకు ఒక్కొక్క రథికుడు వుంటున్నాడు. ఇది అందరికి సమానమే కదా. ఒక్కొక్క బండి ఒక్కొక్క రూపంలో వుండవచ్చు. ప్రతి దేహము ఒక రథము వంటిదే. ఈ రథము లోపల ఒక డ్రైవరు వుంటున్నాడు. మానవత్వములోపల సమత్వమనేది యిది. రథము, రథికుడు రెండూ సమత్వమే. ఇదే మానవత్వములోని యేకత్వము. కనుక యీ యేకత్వము లోపల యనేకత్వమును భావించటంకంటె అనేకత్వములో వున్న యేకత్వాన్ని గుర్తించటం అత్యవసరము. ప్రతి మానవునికి యేకత్వమైన సూత్రులు స్పష్టముగా కన్పిస్తూనే వున్నవి. ఒక చక్రవర్తి వుండవచ్చును. అతనికీ ఆకలి వుంటున్నది. అతనికి ఆకలి అయితే పంచభక్ష్యపరమాన్నములు భుజించవచ్చును. భుజించటముతో ఆకలి తీర్చుకోవచ్చును. ఒక భిక్షగాడు వుంటున్నాడు. అతనికి ఆకలి వుంటున్నది. అతనికి ఆకలి తీరాలంటె అంబలి గంజితో ఆకలి తీర్చుకోవచ్చును. భిక్షగానికి అంబలిగంజి కోటీశ్వరునికి పంచభక్ష్యపరమాన్నములు. ఈ పదార్ధములు వేరుగానే యిద్దరికి ఆకలి తీరటము సమానమే. ఆకలి దప్పులు అందరికి ఒక్కటే. జననమరణములు అందరికి ఒక్కటే. సుఖదుఃఖములు అందరికి ఒక్కటే. దుఃఖము వస్తే కోటీశ్వరుడు యేడుస్తాడు వీడూ యేడుస్తాడు ఇది అందరికి యేకత్వముగా వుండినప్పుడు, యిది భిన్నత్వం అని యేరీతిగా మనము వాదించటానికి వీలవుతుంది. లౌకికజగత్తునందు భోగభాగ్యములు వ్యత్యాసంగా వుండవచ్చు. కాని దైవదృష్టియందు సర్వులు కూడను ఒక్కటే. అన్ని జీవులయందు ఆత్మస్వరూపమైన దైవము వున్నాడు. కనుక ఆ యేకత్వాన్ని మనము వహించి మానవులందరు కూడను ఒక్కటే అనే జీవితతత్వాన్ని అర్ధం చేసుకోవాలి. ఈనాడు ఆవిధమైన యేకత్వము చాలా భిన్నముగా మారిపోవటంచేతనే జగత్తు లోపల యీ విధమైన కష్టములధికమవుతూ వస్తున్నాయి. ఈనాడు మనసంస్థలయందు యీ యేకత్వాన్ని మనం అభివృద్ధిపరచాలి. మానవులందరూ ఒకటే. అందరు దైవము యొక్క అంశమంతె. అన్ని దేహముల యందు వుండిన ఆత్మ ఒకటే. కనుక యీ రూపనామముల యొక్క వికారమును చూచి మనము యేమాత్రము భ్రాంతిల్లరాదు. దానిని త్యజించు. దానియందున్న యేకత్వాన్ని వరించు. మనం చేయవలసిన సేవ యీనాడు

అదే. దానిని మనం అర్థం చేసుకోకుండా యెన్ని సేవలు చేసినా ప్రయోజనము లేదు. మనసునిండా మాలిన్యముంచుకొని ధర్మములు, ధర్మములని సేవలాచరించినంత మాత్రమున అదియే మాత్రము ఫలితమునందించలేదు.

దుర్బుద్ధులు తలనున్న దూరులు విను చెవులున్న
పొంచి చూచు కనులున్న పంచల విను మనసున్న
వంచితగుణ చిత్తమున్న వంచించే హృదయమున్న
ఈ గుణములు చూడగనే ధర్మము యిక నిలువదన్నా.

ఆ హృదయములో ధర్మమనేది యే మాత్రము నిలచటానికి వీలు కాదు. ధర్మం దైవస్వరూపము. ఆ ధర్మము సమత్వములో వుంటున్నాది. కష్టములకు కృంగటముగాని, సుఖములకు పొంగటముగాని లేని సమత్వమును మనము యీ సేవలలో సంపాదించుకోవాలి.

ఆనాటి పరమ భక్తులైన వారంతా యీ సత్యాన్ని ఆచరణలో పెట్టుకుంటూ వచ్చారు. చాలా మందికి తెలుసు తుకారాం. అతను పరమ భక్తుడు. అతనికి అర్థ ఎకరము భూమి వుండేది. దానిని యేదో పండించుకోటమో, ఎండించుకోటమో జరుపుకొని, పొట్టను నింపుకోటమో లేక కాల్చుకోటమో జరుగుతూ వుండేది కాని తనయొక్క ఆహార విహారములకే మాత్రము లక్ష్యము చేయకుండా దైవచింతన మాత్రం నిరంతరం సల్పుతుండేవాడు. అతనికి భార్యబిడ్డలు వుంటున్నారు. కానీ అతనియొక్క భూమిలో వర్షములు పడటంచేత ఒకమారు చెరకుతోట వేసుకున్నాడు. అతని హృదయము త్యాగమయమైనది. భోగముతో కూడినది కాదు. అది పంటకు వచ్చేటప్పటికి ఆ రోడ్డులో అటు పోయేవారు యిటు పోయేవారు తాతా! తాతా! ఒక చెరకు నిస్తావా అని అడిగేవారు. అడిగినవారినందరిని కొట్టుకొని తీసుకుపొమ్మనేవాడు. అంత త్యాగం పాపం. ఈ విధముగా జరుగుతూ జరుగుతూ కడపటికి మూడు భాగములు చెరకంతా యితరులకు దానం చేయటంలో సరిపోయింది. ఏదో అంతో యింతో వారికి పనికిరాని చెరకును నిల్పిపోయారన్నమాట. దానిని కొట్టుకొని బండిలో వేసుకొని యింటికి వస్తున్నాడు. ఆ దారియందు పిల్లలందరు గుంపు చేరి నాకొక చెరకు తుండు యివ్వమని అడుగుతూ వచ్చారు. అక్కడ కూడా దారిపొడవునా యిచ్చుకుంటూ వచ్చాడు. ఇంటి దగ్గర కొచ్చేటప్పటికి ఒక చిన్న చెరకు తుంటు మిగిలింది. బండి చూచింది. భార్య మండిపడింది. నీకేమి యింటిలో భార్య బిడ్డలు లేరా? వాళ్ళ గతి యేమనుకున్నావు. నీ దానాల్తో ధర్మాలతో నేవు మునిగిపోతుంటే. కట్టుకున్నందుకు నా కర్తవ్యాన్ని నిర్వర్తించనక్కరలేదా? ఈ విధముగా ప్రశ్నల వర్షము కురిపించింది ఆ భార్య. అన్నింటికి ఆ తుకారాం చిరునవ్వులతో చిందులు తొక్కాడు. కట్టకడపటికి ఒక్క జవాబు చెప్పాడు. ఇదుగో తెచ్చాను ఒక చెరకు నీకోసం అన్నాడు. అది చేతికి యిచ్చేటప్పటికి ఆమెకు చాలా బాధ కల్గింది. కోపము కూడ వచ్చింది. ఆ చెరకు తుండు తీసుకొని కాళ్ళపైన కొట్టిందామె. ఒక చిన్న తుండైపోయి

519118710

క్రిందపడింది. ఒక తుండు ఆమెచేతిలో నిల్చింది. ఆనందంగా నవ్వాడు యీతుకారాం. ఈ తుకారాం నవ్వటానికి కారణమేమిటో తానే చెబుతున్నాడు. బండిలో యీచెరకులు తెచ్చినంతసేపూ పిల్లలకు యీ భాగము భార్యకు యీ భాగము యివ్వాలని నేను ఆలోచించుకుంటూ వచ్చాను. ఇప్పుడు నాకా బాధ తీరిపోయింది. నభాగము నీ చేతిలో నిల్చింది. క్రిందపడిన భాగము పిల్లలకు సరిపోయింది. అన్నాడు. ఎంత సమంగా నవ్వుపంచినావని ఆనందించాడు. ఈ విధమైన సమాన భావములో సమ త్వాన్ని గుర్తిస్తూవచ్చాడు.

మహాభారతములోని ద్రౌపతి తత్వాన్ని కూడను మీరందరు గుర్తించేవుండ వచ్చును. చీకటిలో పవళించిన తనపుత్రులను అశ్వద్ధామ గొంతు ఒకోసి పోయాడు. పట్టలేని దుఃఖములో ఆమె కృంగిపోయింది. ఈ దుఃఖాన్ని చూచి అర్జునుడు అశ్వద్ధామను పట్టుకొని వచ్చిన కనుల యెదురుగా అతనిని శిరచ్ఛేధము చేస్తానని ప్రతిజ్ఞపట్టాడు. అతనిని పట్టుకొని వచ్చాడు అర్జునుడు. అతనిని చూచేటప్పటికి ద్రౌపది పరుగెత్తుకొనిపోయి కాళ్లుపట్టుకుంది.
స్వామి!

ఉద్రేకంబున రారు శాస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం
చిద్ద్రోహంబును నీకు జేయరు బలోత్సేకంబుతో జీకటిన్
భద్రాకారుల చిన్నపాపల రణప్రౌఢక్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహారింప నకటా నీ చేతులెట్లాడెనో.

అంతేకాదు

పరగన్ మా మగవారలందరును మున్ బాణప్రయోగోపసం
హరణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం
చిరి పుత్రాకృతి నున్న ద్రోణుడవు నా చిత్తంబులో లేశమున్
గరుణాసంఘము లేక శిష్యసుతులన్ ఖండింపగా పాడియే.

ఈ విధముగా పాపం అతనిని ప్రార్థిస్తూవుండాది ద్రౌపది. అర్జునునికి కోపం వచ్చి తన ఖడ్గమెత్తాడు. అడ్డుపడింది ద్రౌపది.. నాథా యిది మంచిది కాదు. బిడ్డలు లేకపోవటంచేత నేనెంత బాధపడుతున్నానో యీ బిడ్డపోయిందంటే తనతల్లి కూడను అంత బాధపడుతుంది కదా. నాకు జరిగినది జరిగిపోయింది. నాదుఃఖము యింక తప్పటానికి వీలుకాదు. ఇది నేను అనుభవించే తీరవలెను. కానీ అశ్వద్ధామను నీవు ఖండించినప్పుడు అశ్వద్ధామ తల్లి యెంత బాధపడుతుందో. ఆమె మనసు కూడా నావంటిదే కదా అని యీ సమత్వాన్ని ఆమె గుర్తించటానికి ప్రయత్నించింది. కనుక మాతృహృదయము అందరిదీ ఒక్కటే. నీకుమారుని వియోగము నీకెంత బాధనో యింకొక కుమారుని యొక్క వియోగము కూడను ఆ తల్లికి సమముగానే వుంటుంది కదా.

అదే విధముగా యీ సేవలో ప్రవేశించేవారంతా ఒకరు మనలను దూషిస్తే

5|9||87||

మనకెంతకష్టమో అదే విధముగనే యితరులను మనము దూషిస్తే వారికికష్టంకాదా. మనబాధలు, మన ఆనందము, మనసుఖము, మన సంతోషము మనకెట్టిదో యితరులయొక్క ఆనందము సుఖము, సంతోషము వారికట్టిదనే సమత్వాన్ని మొట్టమొదట మనం అర్థంచేసుకోవాలి. ఇలాంటి ఆదర్శవంతమైన మార్గాన్ని అందించిన మహాపురుషులు యీభారతదేశములో కొల్లలుగావున్నారు. ఇంక యింగ్లీషులోపల కూడను యినేకమందిని మీరు చూసేవుంటారు. సోక్రటీస్ మహా వేదాంతి. అతను యెప్పుడుకూడను యీయేకత్వము లోనే తాను చింతిస్తూవుండేవాడు. ఈ యేకత్వమనేదానిలో చింతన చేసి అదే మీమాంస, అదే నిరంతరము కూడను దానియొక్క సమత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించేవాడు. కష్టసుఖములు రెండింటిని సమత్వముగా భావించే తత్వాన్ని తాను అర్థం చేసుకున్నాడు. ఒకనాడు ముందువరండాలో కుర్చీపైన కూర్చొని కండ్లు మూసుకొని యోచిస్తున్నాడు. తత్వమసి అనే మహావాక్యమును, అహంబ్రహ్మాస్మి అనే మహావాక్యమును, ఏకోహంబహుస్యాం అనే తత్వాన్ని యోచిస్తూ యోచిస్తూ దీర్ఘంగా మునిగిపోయాడు. భోజనం వేళ కావచ్చింది. లోపలినుండి తన గృహలక్ష్మి ఏమండి అన్నం వడ్డించాను త్వరగా రండి అని పిలచింది. వినిపించుకోలేదు. ఇంకా గట్టిగా అరచింది యీమె. దగ్గరకు పోయి పిలచింది. కానీ ఆలోచిస్తున్నవాడు యోచనలోనే వున్నాడు. ఆనంద భాష్పాలు రాలుతున్నాయి. ఈమె మాటలనేమీ గుర్తించటంలేదు. ఇతను నిద్రలో వున్నాడో, తన్మయత్వములో వున్నాడో, మత్తులో వున్నాడో, ఉన్మత్తంలో వున్నాడో యేమిటో అనుకొని, లోపలికి పరుగెత్తిపోయింది. ఒక బిందెడు నీళ్లు తెచ్చి నెత్తిపైన పోసింది. లేచాడు సోక్రటీసు. దినము కేవలము వురుములు మాత్రమే వురుముతుండేవి. ఇవాళ కుంభ వర్షం కురిసింది అన్నాడు. అనగా భార్య యీవిధంగా చేసిందని అతనికి మాత్రము ఆవేశంగాని, వుద్రేకంగాని రాలేదు. శాంతముగా యిది ఒక వర్షము అనుకున్నాడు తాను. ఈ విధముగా unity చేసుకునే భావము లుమనలో వుండినప్పుడే సమాజములోపల సరైన ఆదర్శవంతమైన సేవలు చేయుటానికి అర్హులమౌతాము. ఒకరినొకరు ద్వేషించుకోటము, ఒకరిపైన ఒకరు అసూయాభావములు పెంచుకోటము యిది మన సంస్థలకు విరుద్ధమైనది. అందరు ఒక తల్లి బిడ్డలవలె మనం పెరగాలి. అందరూ ఒక ఆత్మస్వరూపులుగా మనము విశ్వసించాలి. అప్పుడే సేవలయందు కూడను వుత్సాహ ప్రోత్సాహములను మనము అభివృద్ధిగావించుకోవచ్చును. మనకు యెంత ధనము వుండినప్పటికిని, యెంత అధికారిగా వుండినప్పటికిని సేవలయందు మాత్రము అందరూ ఒక్కటిగానే మనం విశ్వసించాలి. ఏమిటి యీధనము. ఏమిటి యీపదవులు. ఏమిటి యీ అధికారములు. ఎంతకాలముంటాయి. ఈ పదవులతో, యీ ధనములతో, యీ అధికారములతో మనము అందుకొనేది యేమాత్రము లేదు. రావలసినవి వస్తాయి. పోవలసినవి పోతాయి. కానీ దైవానుగ్రహము ఒక్కటే మనకు పోనిది. రానిది. అనగా దైవం వేరు నేను వేరు అనే తత్వము కాదిక్కడ. దైవాన్ని కేవలం ఒక Relationshipగా మనం పెంచుకోటానికి వీలుకాదు. కొంతమంది నీవే తల్లివి తండ్రివి, నీవే నా తోడు నీడ, నీవే దైవము

నీవే సఖుడవు, నీవే సురుడవు. ఆహా ఎన్నివిధాలుగా వర్ణిస్తుంటారో. ఇది చాలా అజ్ఞానము. ఎందుకోవర్లన. నీవే తల్లివి, నీవేనా తండ్రివి అని చెప్పుకున్నంత మాత్రమున అల్పతృప్తి కాని యిది ఆత్మతృప్తి కాదు. ఇన్ని చెప్పుటకంటె నీవే నేను నేనే నీవు అనుకుంటే యెంతసులభముగా అయిపోతుంది. అహంబ్రహ్మాస్మి అహంబ్రహ్మాస్మి నేనే బ్రహ్మ నేనే బ్రహ్మ అంటారు. ఇందులో కూడను ఒకవిధమైన దోషముంది. బ్రహ్మబ్రహ్మ అనటానికి నేను అనేపదము పక్కన వుండాలి కదా. నేనే బ్రహ్మ. ఆనేనెవరు. ఆనేను అనేపదమును అర్థం చేసుకుంటే బ్రహ్మ తానుగానే అయిపోతాడు. ఏదో అర్థంకాని పదములనంతా మనము వుచ్ఛరించుకుంటూ, అది ఒక మంత్రాలుగా, అది ఒక తంత్రాలుగా, అది ఒక యంత్రాలుగా భావిస్తూ మన జీవితాన్ని మనము వ్యర్థముగావిస్తున్నాము. కాని అది ఒక మొదటస్థాయికి అవసరమే. కాని క్రమక్రమేణా కూడను మనం యెంతవరకు అదేస్థాయిలో వుండరాదు. మన జీవితమనేది మూడుక్లాసులుగా విభజించారు. ఒకటి ప్రైమరీక్లాసు. రెండవది హయ్యర్ సెకండరీక్లాసు. మూడవది కాలేజీ లెవెల్. అదేవిధముగనే మొట్టమొదట మనం కర్మమార్గంలో ప్రవేశించాలి. తర్వాత ఉపాసన హయ్యర్ సెకండరీ స్కూలులో మనం చేరాలి. అక్కడ ప్యాసైపోతే జ్ఞానమనే కాలేజీలో మనము పూర్తి మన జీవితాన్ని పట్టము కట్టుకోవాలి. చాలామంది మనం యేదో కాలేజీలోనే చదివేసి ఆ పట్టాలనందుకుందామని ప్రయత్నిస్తూవుంటారు. అది చాలా పొరపాటు. ప్రైమరీ స్కూలులో చదవకుండా, హయ్యర్ సెకండరీ స్కూలులో చేరకుండా కాలేజీలో పట్టము అందుకోటము యిదియే మాత్రము వీలుకాదు. కనుక మొట్టమొదట మనము కర్మమార్గములో ప్రవేశించాలి. ఆ కర్మయందే అధికారము వుంటున్నది. కర్మలోనే ధర్మము వుంటుంది. ఆ ధర్మములోనే మర్మము వుంటుంది. ఆ మర్మాన్ని గుర్తించటంకోసమే జన్మము వచ్చింది. ఆ జన్మము ధన్యము చేసుకోటంకోసమే ఆత్మతత్త్వాన్ని మనము అనుభవించాలి. కనుక కర్మలో మనము ప్రారంభించాలి. ఆ కర్మ నిష్కామకర్మగా రూపొందాలి. నిస్వార్థమైన సేవలో మనము ప్రవేశించాలి.

ఈనాడు active workers అని యిక్కడ ప్రవేశించారు. Active workers అంటే దీనికి అర్థము యేమిటి? అనగా నిరంతరము పనులలోనే మన జీవితాన్ని గడపటము అని దీనికి అర్థము. అయితే యేంపని చేస్తున్నాము. తనపని తాను చేసుకుంటున్నాడా లేక సమాజము లోపల సమాజముకోసము చేస్తున్నాడా? కానీ యీనాడు సమాజదృష్టి కలిగినవారు చాలా తక్కువ. స్వార్థబుద్ధితోనే యీసమాజములో సేవచేస్తూవుంటారు. కాని మన సంస్థలలో ఆవిధమైన దృష్టి రాకూడదు. నాదే సమాజము ఈ రెండు ఒక్కటే. సొసైటీకి యేమి చేస్తున్నానో అది నాకోసం చేసుకుంటున్నాను. ఆ భావంతో మనము సొసైటీలో సేవచేసినప్పుడే సొసైటీ ఆనందిస్తుంది. ఆ ఆనందము మీకును అందిస్తుంది. నేను అనే అహంభావము వదలిపెట్టి అంతా నాదే అనే యేకభావాన్ని మనం అభివృద్ధి పరచుకోవాలి. అయితే యిది అంత సులభము కాదు. కాని సులభము కాదని మనం విసర్జించరాదు. సాధ్యమైనంతవరకు ప్రయత్నం చేయండి. ఈ ప్రయత్నం చేత దానిలో

సఫలీకృతం కావచ్చును.

సాధన మన పనులు సమకూరు ధరలోన. నేనెక్కడ. ఈ సమాజమెక్కడ, ఈ శక్తి యెక్కడ అని ఈ విధమైన నిరుత్సాహానికి మనము యేమాత్రం స్థానం ఇవ్వరాదు. తలచుకుంటే యేమైనా చేయవచ్చును. కనుక మానవుని యొక్క సంకల్పములో వుండిన పట్టుదల యిట్టిది అట్టిదని కాదు. దాని శక్తి మనిషి మరణించినాకాని జీవించే వుంటుంది. కనుక ఆదర్శవంతమైన జీవితాన్ని అందించే మానవునిగా మనం రూపొందాలి. ఏ కర్మలు ఆచరించినా, భగవత్ప్రీత్యర్థమనే భావముతో మనము అర్పితము గావించాలి. ఏది చేసినా అది దైవసేవగానే విశ్వసించాలి. ఆవిధమైన సేవలలో మనం పాల్గొని అలాంటి సేవల నిమిత్తమై మనం జీవించినాము. ఇది ఒక గొప్ప అదృష్టమనే దీనిలో మనము దీనిని చింతించి ఈ అదృష్టకార్యాన్ని, అదృష్టమైన రీతిగా మనము అభ్యసించి దానిలో అదృష్టమైన ఆత్మతత్వాన్ని మనం అనుభవించాలి. తనను తాను గుర్తించుకొనే తత్వమే సేవ యొక్క పరమార్థము. తాను గుర్తించుకున్నాడా సర్వము తానుగానే మారిపోతాడు.

ప్రేమస్వరూపులారా! ఈనాడు ఇట్టి సేవ యెంతైనా అవసరంగా వుంటున్నది. ప్రపంచమునందు వుండిన అల్లకల్లోలములు, అశాంతులకు ఇది ఒక ప్రశాంతమైన వాతావరణాన్ని అందించే అవకాశంగా వుంటుంది. అందరు కూడను అన్నదమ్ములవలె మెరురండి. ఆ అన్నదమ్ములుగానే మన జీవితాన్ని మనం అంతం చేయకూడదు. ఆత్మస్థాయికి మనం చేరాలి. అన్నమయమైన దేహముతో ప్రారంభమై ఆనందమయమైన ఆత్మలో మనం ప్రవేశించాలి. జీవితము అన్నమయము, అన్నమయముతో మునిగిపోరాదు. అన్నమయమునుండి విజ్ఞానమయమునకు ప్రయాణం చేయాలి. ఈ విజ్ఞానమయమునుండి ఆనందమయమునకు ప్రవేశించాలి.

ఈ అల్పమైన, తుచ్ఛమైన, క్షణికమైన స్వార్థమును మనము త్యజించాలి. స్వప్రయోజనము అనే దానిని లక్ష్యమునుండి తీసి పారెయ్యాలి. దైవభావాన్నే మన హృదయములో ప్రతిష్ఠించుకోవాలి. త్యాగభావముతో కర్మలో మనము ప్రవేశించాలి. ఇదే మనము చక్కగా ఈనాటి నుండి కూడను ఆచరణలో పెట్టే అవకాశానికి మనం కొంత ప్రయత్నించాలి. ఇంకా ఈ సేవ యొక్క ఫలితముగాని, సేవ యొక్క అంతరార్థముగాని, ఈ సేవ యొక్క గమ్యముగాని మున్ముందు కొంతవరకు రేపో, మరునాడో మనం విచారించుకోవచ్చును. నిజముగా ఈ సేవకంటె మించినది మరొకటి ఈ జగత్తులో యేమాత్రం కూడను కనుపించదు. కనుక ఈ సేవలోనే మన జీవితాన్ని అంకితం గావించాలి. సేవ చేయని మానవుడు మానవుడే కాదు. పశువు కంటె హీనమని చెప్పవచ్చును. కనుక సేవకు మనం దూరం కారాదు. సేవను మనం త్యజించరాదు. సేవతే మన ప్రాణము. సేవతే మన జీవనము. సేవతే మన గమ్యము. ఈ సత్యాన్ని మీరు చక్కగా బలపర్చుకొని మున్ముందు సేవలలోపల, ఈ జగత్తులో ఆదర్శవంతమైన సేవకులుగా మీరు తయారు కావాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.